

నేటి నుంచి దర్గాలో ఉరుసు ఉత్సవాలు



ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లా కేంద్రంలోని పాత రాయచోటిలో వెలసిన హజరత్ జమాలుల్లా బాబా ఉరుసు మహోత్సవాలు ఈ నెల 15వ తేదీ నుంచి జరగనున్నాయి. ఆదివారం గంధం ఊరేగింపుతో ఉరుసు మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. సోమవారం మధ్యాహ్నం దర్గా ఆవరణలో భారీ అన్నదాన కార్యక్రమం. ఉంటుంది. అదే రోజు సాయంత్రం ఉరుసు ఉత్సవం జరగనుంది. మంగళవారం తహలీల్ ఫాతేహా కార్యక్రమంతో ఉరుసు ఉత్సవాలు ముగియనున్నాయి. ఉరుసు ఉత్సవాలకు హిందూ, మహమ్మదీయ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు తెలియజేశారు.

పేదల గూడు..పూర్తయ్యేదెన్నడో?

- నత్తనడకన ఇళ్ల నిర్మాణాలు
- 73,221 ఇళ్లకు 34,438 మాత్రమే పూర్తి
- పేదల సొంతింటి కల నెరవేరేనా?
- 42 శాతం మాత్రమే పూర్తి



జగనన్న కాలనీలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పేదలు గృహాలు నత్తనడకన నిర్మాణ పనులు సాగుతున్నాయి. పేదల సొంతింటి కల కలగానే మిగిలిపోయింది. గత ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా చేపట్టిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతుండటంతో లక్ష్యం నెరవేరడం లేదు. ఇళ్లు ఎప్పుడు పూర్తవుతాయోనని లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న కాలనీలు-పేదలకు ఇళు పథకాన్ని ప్రారంభించింది. జిల్లా వ్యాప్తంగా 496 లేఅవుట్లు ఏర్పాటు చేశారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి 73,221 గృహాలు మంజూరు చేసింది. రూ.13.24 కోట్ల నిధులు కేటాయించింది. ఆయా లేఅవుట్లలో ఇప్పటి వరకు 34,438 గృహాలు మాత్రమే పూర్తయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు మొదలు పెట్టని 9,017 గృహాలు ఉన్నాయి. బిలో బేస్ మెట్ లెవెల్ 1806, పునాదులు 19,384, గోడలు 6,680, స్లాబులు 5,828, వివిధ దశలలో మిగతా పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రభుత్వమే ఒక గృహానికి రూ.1.80 లక్షలు మంజూరు చేసింది. 20 లక్షలు టన్నులు ఇసుక, 90 బస్తాలు సిమెంటు, 480 కిలోల స్టీల్‌ను అతి తక్కువ ధరకే అందజేస్తున్నారు. అప్పటి ప్రభుత్వం ఇన్ని సదుపాయాలను కల్పించినప్పటికీ లబ్ధిదారులకు గృహ నిర్మాణ శాఖ అధికారులు సరైన అవగాహన కల్పించలేదని పలువురు చర్చించుకుంటున్నారు. బిల్లులు కూడా ఆలస్యం అవుతున్నాయని లబ్ధిదారులు కొందరు చెబుతున్నారు. రాయచోటిలో ఉన్నటువంటి జగనన్న కాలనీలో సిసి రోడ్లు డ్రెయినేజీ లేక ఇబ్బంది పడుతున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రస్తుతం సిమెంటు, లేబర్, ఇసుక, బేల్దారి కూలీలు అధికమయ్యాయని ప్రస్తుతం ఇస్తున్న 1.80 లక్షలు సరిపోవడంలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఒక్కొక గృహానికి రూ.4 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ మొత్తం గతంలో మంజూరైన గృహాలు కూడా ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఇటీవల కాలంలో గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలెక్టర్ శ్రీధర్ చామకూరి సమీక్ష నిర్వహించి గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ గృహ నిర్మాణ పనులు నత్తనకు నడక నేర్పుతున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు. జిల్లాలో మిగిలిన గృహాలు పూర్తి చేయాలంటే ఇంకా ఎన్ని రోజులు సమయం పడుతుందో వేచి చూడాల్సిందే.

నియోజకవర్గాల వారీగా ఇళ్ల నిర్మాణాలు...

రాజంపేట నియోజకవర్గంలో 11206 గృహాలు మంజూరు కాగా 4,058 పూర్తయ్యాయి. ఇప్పటి వరకు మొదలు పెట్టినవి 1766, మట్టి తీసినవి 363, పునాదులు 2,813, గోడలు 778, స్లాబ్లు 775 ఉన్నాయి. రాయచోటిలో 2,0043 గృహాల మంజూరు కాగా 7944 గృహాలు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు మొదలు పెట్టినవి 2,171, మట్టి తీసిన 447, పునాదులు 5,969, గోడలు 1384, స్లాబ్లు 1071, రైల్వేకోడూరులో 6523 గృహాలు మంజూరు కాగా 2,813 గృహాలు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు మొదలుపెట్టినవి 1732, మట్టి తీసినవి 217, పునాదులు 795, గోడలు 574, స్లాబ్లు 230, తంబళ్లపల్లెలో 12,947 గృహాలు మంజూరు కాగా 5774 గృహాలు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు మొదలు పెట్టినవి 2092, మట్టి తీసినవి 358, పునాదులు 1918,గోడలు 1670, స్లాబులు 820, పీలేరులో 12,101 గృహాల మంజూరు కాగా 6131 గృహాలు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు మొదలుపెట్టనివి 522, మట్టి తీసినవి 154, పునాదులు 3321, గోడలు 1218, స్లాబులు 568, మదనపల్లిలో 15,401 గృహాల మంజూరు కాగా 7718 గృహాలు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు మొదలుపెట్టిన 714 మట్టి తీసినవి 267, పునాదులు 4568, గోడలు 1353, స్లాబులు 478 వివిధ దశలలో ఆగిపోయినాయి.

కూలీలు పెరిగి పోయినాయి



బేల్దారి, కూలీలు, రాళ్లు, ఇసుక, బాడుగలు రేట్లు అధికమయ్యాయి. ప్రస్తుతం ఇస్తున్న రూ.1.80 లక్షలు ఇల్లు కట్టుకోవడానికి సరిపోవడం లేదు. కూటమి ప్రభుత్వం రూ.4 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చింది. పాత గృహాలకు ఈ మొత్తాన్ని వర్తింపజేయాలి.కాలనీలో సిసి రోడ్లు, డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలి.

- శిరీష, లబ్ధిదారు, రాయచోటి.

లక్ష్యాలను పూర్తి చేస్తాం



జిల్లాలో పక్కా గృహాల నిర్మాణ లక్ష్యాన్ని పూర్తి చేస్తాం. డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. మండల ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశాలు కూడా నిర్వహిస్తున్నాం. లబ్ధిదారులకు బిల్లులు కూడా సకాలంలో చెల్లిస్తున్నాం. రాష్ట్రంలో జిల్లా మూడవ స్థానంలో ఉంది. లక్ష్యాన్ని పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

- శివయ్య, హౌసింగ్ పీడీ, రాయచోటి.

వెంటాడుతున్న యూరియా కొరత

కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు
రైతు సేవా కేంద్రాల్లో దొరక్క అవస్థలు
ప్రయివేట్ దుకాణాలను ఆశ్రయిస్తున్న రైతులు

యూరియా అందక రైతుల్లో ఆందోళన నెలకొంది. రైతు సేవా కేంద్రాల్లో, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. కొందరు డీలర్లు కృత్రిమ కొరత సృష్టించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే అదనుగా కొంత మంది వ్యాపారులు ధరలు ఇష్టానుసారంగా పెంచేసి అమ్ముతుండటంతో రైతులకు ఆవేదన తప్పడం లేదు.



ప్రజాశక్తి - చాపాడు

ప్రభుత్వాలు మారినా, రైతు సేవా కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటైనా రైతులకు సమస్యలు మాత్రం తప్పడం లేదు. ప్రస్తుతం ఖరీఫ్‌లో వరి పంట సాగు చేసే రైతులకు ఎరువుల కొరత ముఖ్యంగా యూరియా కోసం నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో ఎరువుల కోసం గంటల తరబడి క్యూలైన్లలో నిలిచే రైతులకు రైతు సేవా కేంద్రాలను గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసి అవసరమైన ఎరువులు గ్రామాలకు చేరవేస్తామని అని ప్రకటించిన ప్రభుత్వం అమలులో మాత్రం పూర్తిగా వైఫల్యం చెందినట్లు తెలుస్తోంది. రైతు సేవా కేంద్రాలకు రైతులు ఆధార్, పట్టాదారు పాసు పుస్తకంతో ఎరువులు అందుబాటులో ఉన్న సందర్భంలో మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి వస్తుంది. రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు కావాలంటే ప్రయివేటు దుకాణాలను ఆశ్రయించాల్సి వస్తుంది. యూరియా కోసం రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తుంది. యూరియా నిలువ వచ్చిన రోజు సాయంత్రంలోపు పూర్తిగా అయిపోతుంది. తిరిగి నిలువ రావడానికి 15 రోజుల సమయం వేచి ఉండాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ఒక్కొక్క రైతు భరోసా కేంద్రం పరిధిలో ఒకరు లేదా ఇద్దరు రైతులకు మాత్రమే యూరియా లబిస్తున్నట్లు తెలుస్తుంది. ఎరువుల దుకాణాల్లో కూడా యూరియా కొరత కొట్టొచ్చినట్లు కనిపిసుంది. ముఖ్యంగా మైదుకూరు పట్టణంలో వ్యాపారులు కృత్రిమ కొరత చూపిస్తున్నట్లు తెలుస్తుంది. రైతులకు అవసరం లేకపోయిన దుకాణాల వారు సూచించిన ఎరువులు తీసుకుంటేనే యూరియా ఇవ్వడం, యూరియాను అధిక ధరకు అమ్మకాలు చేపట్టడం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో కెసి కెనాల్, కుందూ పరిధిలో జిల్లాలో 90 వేల ఎకరాలలో వరి పైరు ను రైతులు సాగుచేస్తున్నారు. ఎకరాకు 2 బస్తాలు యూరియాను వినియోగించినప్పటికీ రెండు లక్షల బస్తాల యూరియా అవసరం ఉంటుంది. చాపాడు మండల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే 10 వేల ఎకరాలకు పైగా వరి పంట సాగు అయింది. వారం, పది రోజుల్లో మూడు నుంచి నాలుగు వేల ఎకరాల్లో వరి పంట సాగు అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో రోజుకు పది బస్తాల యూరియా కూడా లభించడం లేదు. చాపాడు మండల రైతులు అధికంగా మైదుకూరు ప్రొద్దుటూరు ప్రాంతాలకు వెళ్లి ఎరువులు కొనుగోలు చేసే ఆనవాయితీ ఉంది. మైదుకూరులో ఏ దుకాణంలో కూడా 10 రోజుల నుంచి యూరియా అందుబాటులో లేనట్లు కొరత లేనట్లుగా చూపిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం యూరియా కొరత రైతులను వెంటాడుతోంది. అధికారులు మాత్రం యూరియా కొరత లేనట్లు ప్రకటనలు చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినా రైతులకు తిప్పలు తప్పడం లేదని తేట తెల్లమవుతుంది. యూరియా కొరతపై వ్యవసాయ అధికారులు జిల్లావ్యాప్తంగా కొరత ఉందని చెబుతున్నారు..రైతులు మాత్రం చేసేది ఏమీ లేక ఇతర ఎరువులతో సరిపెట్టుకోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వరి పంట సాగుచేసే రైతులకు యూరియా కొరత లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అందుబాటులో ఉంచాలి

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 4 ఎకరాలలో వరి పంటను సాగు చేపట్టాను. రైతు సేవా కేంద్రాల్లో యూరియా కోసం వెళ్ళినప్పుడు అందుబాటులో ఉండడం లేదు. మైదుకూరులో ప్రయివేట్ దుకాణాల్లో అన్ని రకాల ఎరువులు కొనుగోలు చేస్తేనే యూరియాను ఇస్తున్నారు. ఉన్నత అధికారులు స్పందించి యూరియాను రైతులకు అందుబాటులో ఉంచాలి. ప్రయివేట్ దుకాణాల్లో రైతుల కోరిన వెంటనే యూరియాను అందించేలా ఆదేశాలు జారీ చేయాలి

-వీరారెడ్డి, రైతు, సిద్ధారెడ్డిపల్లి.

సమృద్ధిగా లభించడం లేదు

ప్రయివేట్ దుకాణాల్లో యూరియా నిలువ లేదంటున్నారు. అన్ని రకాల ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు మాత్రం యూరియాను అందిస్తున్నారు. కేవలం యూరియా కోసమే దుకాణాలకు వెళితే లేదని వెనుకకు పంపుతున్నారు. రైతు సేవా కేంద్రాల్లో కన్నా రూ. 10 అధికంగా వసూలు చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి యూరియా కొరత లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ఓబుల్ రెడ్డి, రైతు, పాతపాలెం, మైదుకూరు.

ఎరువులు అందుబాటులో ఉంచాం

మండల పరిధిలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాం. యూరియా అవసరం మేరకు పంపిణీ చేస్తున్నాం. రైతులు యూరియాను అవసరం మేర కంటే అధికంగా వినియోగిస్తున్నారు. యూరియాను అవసరం మేరకు మాత్రమే ఉపయోగిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. ఎరువుల కొరత రాకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం.

- మ్యాగీ, వ్యవసాయ అధికారి, చాపాడు.

పని సర్దుబాటు ఇబ్బందులు తొలగించాలి : యుటిఎఫ్



జెసికి వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి

ఉన్నత పాఠశాలలో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత తీర్చుటకు ఇటీవల విద్యాశాఖ చేపట్టిన తాత్కాలిక పని సర్దుబాటు ప్రక్రియలో కొంతమంది ఉపాధ్యాయులను సుదూర ప్రాంతాలకు బదిలీ చేయడం వలన కుటుంబ సమస్యలు తలెత్తుతున్నాయని అలాంటి వారిని గుర్తించి ప్రస్తుతం పనిచేస్తున్న స్థానిక మండలం లేదా సమీప మండలాల్లో విధులు కేటాయించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌ను శనివారం ఆయన చాంబర్లో కలిసి వినతి పత్రం సమర్పించినట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణ బదిలీలు అయితే పాత ఉమ్మడి జిల్లాలు, పాత రెవెన్యూ డివిజన్ ఆధారంగా చేపట్టారని తెలిపారు. ప్రస్తుతం జరిగిన తాత్కాలిక సర్దుబాటు నూతన రెవెన్యూ డివిజన్ల ఆధారంగా చేపట్టడం వలన కొంతమంది ఉపాధ్యాయులు వారు ప్రస్తుతం పని చేస్తున్న ప్రాంతం నుండి 100 కిలోమీటర్ల పైబడి ఉన్న ప్రాంతాలకు సర్దుబాటు చేయడం వల్ల వారి పిల్లల చదువులు, వృద్ధ తల్లిదండ్రుల అనారోగ్య సమస్యల కారణంగా నివాసాన్ని మార్చలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. భార్యాభర్తలు ఇరువురు ఉపాధ్యాయులైతే ఇద్దరికీ దగ్గరగా ఉన్న ప్రాంతాలకు బదిలీ చేయాలనే ఉన్న నిబంధనలకు భిన్నంగా ప్రస్తుతం చేపట్టిన తాత్కాలిక పని సర్దుబాటులో వారు ప్రస్తుతం పని చేస్తున్న ప్రాంతం నుండి మరింత దూరంగా ఉన్న ప్రాంతాలను కేటాయించడం వలన వారు ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. ఉదాహరణకు ఒక తెలుగు ఉపాధ్యాయుడు పీలేరులో పనిచేస్తున్నారు ఆయన స్పౌజ్ తిరుపతి జిల్లా అయిన ఎర్రవారిపాలెంలో పనిచేస్తున్నారని తెలిపారు. వీరు ఇరువురు ప్రస్తుతం పీలేరులో నివాసం ఉన్నారని, పని సర్దుబాటులో సదరు ఉపాధ్యాయుడిని దాదాపు 100 కిలోమీటర్ల దూరంలో ఉండే గాలివీడు మండలం నూలివీడుకు పని సర్దుబాటు చేయడం జరిగిందిన్నారు. సాంకేతిక కారణాలవల్ల కొన్ని మండలాల్లో మిగులుగా ఉన్న ఉపాధ్యాయులను అవసరం లేని పాఠశాలలకు కేటాయించడం ఇదే సందర్భంలో అవసరం ఉన్న చోట కేటాయించలేకపోవడం వంటి అసంబద్ధాలు కూడా జరిగాయని తెలియజేశారు. ఈ విధంగా పని సర్దుబాటులో ఏర్పడిన ఇబ్బందులను తొలగించి సవరణ ఉత్తర్వులు ఇచ్చుటకు చర్యలు తీసుకోవాలని జెసికి విన్నవించగా వారు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీరబల్లి మండల యుటిఎఫ్ నాయకులు శ్యాంసుందర్, గుర్రంకొండ మండల నాయకులు రవి నాయక్ పాల్గొన్నారు.

క్రీడాకారులు వినయ్, దర్శన్‌కు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న గురుప్రసాద్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ఆంధ్ర టి20 క్రికెట్ టీంకు ఎంపికైన కె.వినయ్ కుమార్, వల్లాల దర్శన్ రాజులను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రాటకొండ గురు ప్రసాద్ అభినందించారు. శనివారం ఈ క్రీడాకారులు తిప్పారెడ్డి, గురుప్రసాద్‌లను వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు. రామసముద్రం మండలం, తిరుమలరెడ్డిపల్లికి చెందిన వల్లాల దర్శన్ రాజు, వినయ్ కుమార్ టి20 ఆంధ్ర టీం తరపున ఆడేందుకు ఎంపికయ్యారు. ఈ నెల 16న నేపాల్ దేశంలో జరిగే క్రికెట్ పోటీల్లో ఈ ఇద్దరు క్రీడాకారులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ఆడనున్నారు. ఈ సందర్భంగా తిప్పారెడ్డి మాట్లాడుతూ టి20 క్రికెట్ ఆటలో టెక్నిక్ చూపాలన్నారు. బ్యాట్స్‌మెన్ బౌలర్‌ను, బౌలర్ బ్యాట్స్ మెన్‌ను లక్ష్యంగా ఆడాలన్నారు. ఎంఎస్ ధోని, విరాట్ కోహ్లీ లాంటి క్రికెట్ దిగ్గజాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఒక మారుమూల ప్రాంతంలో పుట్టిన వీరు జాతీయ స్థాయిలో రాణించాలని వినయ్ కుమార్, దర్శన్ రాజులను రాటకొండ గురు ప్రసాద్ అభినందించారు. యూనివర్సిటీ తరపున ఆడితే ప్రయోజనం ఉంటుందని సూచించారు. అనంతరం ఇద్దరికీ శుభాకాంక్షలు తెలిపారు.



అంగన్వాడీలకు సూచనలు చేస్తున్న కేంద్ర బృందం

అంగన్వాడీ కేంద్రాల్లో కేంద్ర బృందం తనిఖీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఐసిడిఎస్ ప్రాజెక్ట్ రాజంపేట పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలను శనివారం కేంద్ర బృందం సభ్యులు సందర్శించారు. బలిజపల్లి, కొల్లావారిపల్లి, రాచపల్లి, మిట్టమీదపల్లి అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి పలు సూచనలు చేశారు. కేంద్ర బృంద అధికారులు సుమిత్ కుమార్, గౌతమ్, జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి పథక అధికారి డి.శశికళ, జిల్లా ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ సైపుల్లా, రాజంపేట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ హనుమంతు రమేష్, సూపర్వైజర్ కె.రాణి ఈ కార్యక్రమంలో పాల్గొని అంగన్వాడీ కేంద్రంలో మంజూరైన ఎల్ఇడి టీవీ, ఆర్వో వాటర్ ఫిల్టర్, ఆర్‌డబ్ల్యూహెచ్ హార్వెస్టింగ్ న్యూట్రి గార్డెన్ మొదలగు వాటిని సందర్శించి సూచనలు, సలహాలు అందజేశారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.శశికళ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అంగన్వాడీ కేంద్రంలో న్యూట్రి గార్డెన్ ఏర్పాటు చేసి ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు పండించాలని సూచించారు. పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. అంగన్వాడీ కేంద్రంకు ప్రీస్కూల్ పిల్లలందరూ హాజరు అయ్యేటట్లుగా చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలకు ప్రతిరోజు హాజరు తప్పక వేయాలని, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వండి పెట్టాలని, పోషణ ఉత్సవాలు అన్ని అంగన్వాడి కేంద్రాలలో జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఉపకార వేతనాలకు 117 మంది విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ కళాశాలలో బి.టెక్ చదువుతున్న 117 మంది విద్యార్థినిలకు ఎఐసిటిఇ మెరిట్ స్కాలర్‌షిప్‌లు పొందినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సియువరాజ్ తెలిపారు. చదువుకోవాలనే ఆలోచన, తెలివితేటలు ఉండి ఆర్థిక పరిస్థితుల కారణంగా చదువుకు దూరమవుతున్న అమ్మాయిలకు ఎఐసిటిఇ స్కాలర్‌షిప్ పేరిట భరోసా కల్పిస్తోందని, ఆర్థికంగా అండగా నిలవడానికి అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఎఐసిటిఇ) న్యూఢిల్లీ వారు ఇంజినీరింగ్ చదువుతున్న అమ్మాయిల కోసం ప్రగతి పేరుతో స్కాలర్‌షిప్‌లు ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున అందించినట్లు తెలిపారు. స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులను కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కమల్ బాషా, స్టూడెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ డాక్టర్ సమీనా, మౌలాలి అభినందనలు తెలియజేశారు.



మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్

జాతీయ లోక్ అదాలత్‌లో 60 కేసులు పరిష్కారం



మాట్లాడుతున్న అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు న్యాయస్థానంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 60 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ సందర్భంగా 60 కేసులు పరిష్కారం కావడంతో పాటు రూ.80,02,200 చెల్లింపులకు అంగీకారం కుదిరిందని కోర్టు ఉద్యోగులు తెలిపారు. చిత్తూరు 9వ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, పీలేరు సీనియర్ సివిల్ జడ్జి కె.రవి ఆధ్వర్యంలో ఈ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిపిలు శారద, చంద్రకుమార్ రెడ్డి, న్యాయవాదులు వి.రెడ్డెప్ప, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బిసి పురుపోత్తంరెడ్డి, భవాని శంకర, వెంకటరమణారెడ్డి, షౌకత్ అలీ, శివకుమార్ రెడ్డి, నాగరాజ, వేణుగోపాల్ పాల్గొన్నారు.



విజయం సాధించిన క్రీడాకారులతో పాఠశాల యాజమాన్యం

క్రీడా పోటీల్లో సత్తాచాటిన విజ్‌డమ్ విద్యార్థులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వేకోడూరు పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 12,13న జరిగిన మండలస్థాయి క్రీడా పోటీలలో విజ్‌డమ్ సిబి ఎస్ఇ విద్యార్థులు అద్భుతం ప్రతిభను కనబరిచారని విజ్‌డమ్ విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ టి.ప్రదీప్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్-14 బాలి కల ఖోఖో విభాగంలో హేమ, వర్షిత, ఎం.వర్షిత, వేద వర్షిణి, శ్రీసాయి, సునయన మోక్షిత, యామినీల జట్టు ప్రథమ స్థానంలో నిలిచారని తెలిపారు. అండర్-17 బాలుర ఖోఖో విభాగంలో గుణచరణ్, కుష్వంత్, కుశాల్, సిద్ధార్థ్, రిషి సమీర్, శేఖర్, పృద్విష్, జస్వంత్ ప్రథమ స్థానం సాధించారని చెప్పారు. అండర్-17 బాలికల ఖోఖో విభాగంలో నిహారిక, మధులత యగ్నిక, మానస, హరిణి ద్వితీయ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. అండర్-17 బాలుర బాడ్మింటన్ పోటీలలో రాహుల్, పురుషోత్తం జట్టు ప్రథమ స్థానం సాధించగా రైల్వే కోడూరు నియోజకవర్గం కబడ్డీ జట్టుకు విజ్‌డమ్‌సిబి ఎస్ఇ హైస్కూల్‌కు చెందిన విష్ణు, దీక్షిత్, యోగేంద్రలు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో అడ్మిన్ డైరెక్టర్ టి.మదన్మోహన్, ప్రిన్సిపల్ టి.ప్రియాంక పాల్గొన్నారు.

వెలిగల్లు కుడికాలువకు నీరు నిలుపుదల

ప్రజాశక్తి-గాలివీడు

వెలిగల్లు ప్రాజెక్టు నుంచి కుడికాలువకు వెళుతున్న నీటిని నిలుపుదల చేసినట్లు ప్రాజెక్టు డిఇ శిరీష్‌కుమార్ పేర్కొన్నారు. వర్షాలు పడడం లేదని కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలమేరకు నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ప్రాజెక్టులో నీటిశాతం తగ్గుముఖం పడుతుండడంతో రాయచోటి పట్టణం, గాలివీడుకు నీటి సరఫరా దృష్ట్యా కుడికాలువ నీటిని నిలుపుదల చేసినట్లు తెలిపారు.


తాగునీటి కోసం ఏర్పాటు చేసిన పైప్‌లైన్

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-రామాపురం

మండలం చిట్లూరు గ్రామం, చెర్వువుముందరపల్లిలో గత కొంత కాలంగా తాగునీటి సమస్యతో గ్రామస్తులు ఇబ్బంది పడుతుండడంతో గ్రామస్తులు సమస్యను మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి ప్రత్యేక నిధులతో ఆ గ్రామానికి కొత్త పైప్‌లైన్ వేయించి నీటి సమస్యకు పరిష్కారం చూపారు. మంత్రి సోదరుడు, టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పనులను పర్య వేక్షించారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

రమణీయం శ్రీవరసిద్ధి వినాయకుడి కల్యాణం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని స్థానిక నీరుగట్టువారిపల్లె, రాంరెడ్డి లేఅవుట్‌లో గల వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణోత్సవం కన్నుల పండుగలా నిర్వహించారు. శనివారం జరిగిన ఈ ఉత్సవానికి పెద్ద ఎత్తున స్వామివారి భక్తులు, స్థానిక ప్రజల హాజరయ్యారు. ఆలయ కమిటీ భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందించారు. మహిళలచే పసుపు, కుంకుమ, గాజులు, పసుపు దారం అందజేశారు. వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా ఆలయంలో ఈనెల 6వ తేది నుంచి 15వ తేది వరకు భక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి. అనంతరం మూడు లడ్డూలు, మూడు టెంకాయలు వేలం నిర్వహించారు. స్వామివారి లడ్డూలను వీరభద్రారెడ్డి రూ.19 వేలకు, టేకురి వెంకటరమణ రూ.7వేలకు, మోడెం వెంకట రమణ రూ.6,300లకు దక్కించుకున్నారు. అనంతరం కోలాటం నిర్వహిం చారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. దాతలు భక్తు లకు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన విద్యుద్ధీపాలు, మంగళ వాయిద్యాలు, బ్యాండు మేళాల నడుమ స్వామి వారి పుష్ప పల్లకి ఊరేగింపు వైభవంగా సాగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయక చర్యల్లో
ఎమ్మెల్యే కృషి అభినందనీయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విజయవాడ వరద బాధితుల సహాయకచర్యల్లో ఎమ్మెల్యే షాజహాన్ బాషా చేసిన కృషి అభినందనీయమని అన్నారు. విజయవాడలో పదిరోజుల క్రితం వరదలు కారణంగా నీట మునిగి సర్వం కోల్పోయిన వరద బాధితులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుమేరకు మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా వారం రోజులుపాటు శ్రమించి రూ.50 లక్షల విలువైన నిత్యవసర సరుకులు, గ్యాస్ స్టవ్లులు, బట్టలు మూడు లారీలలో తరలించి నేరుగా వరద బాధితులను ఆదుకోవడం జరిగిందని ప్రశంసించారు. శనివారం పట్టణంలోని స్థానిక ఎన్‌టిఆర్ కూడలిలో జెసిబి వేణు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. వరద బాధితులను ఆదుకునేందుకు తనవంతు సాయంగా నాయకులు, కార్యకర్తల సమన్వయంతో రూ.50 లక్షల విలువైన నిత్యవసరాలను పోగుచేసి విజయవాడ వరద బాధితులకు అందజేశారన్నారు.

శాఖాహార మహార్యాలీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లెలో ఆదివారం నిర్వహించే శాఖాహార మహార్యాలీని జయప్రదం చేయాలంటూ పిరమిడ్ మాస్టర్స్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూ మెంట్ (పీఎస్ఎస్ఎమ్)ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ము ఖ్యంగా మాంసాహారులను శాఖాహారులుగా తీర్చిదిద్ది ప్రజల్లో చైతన్యం తీసుకురావాలనే ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు.శాఖాహారంతో రోగని రోధకశక్తి పెరుగు తుంద న్నారు. అలాగే జ్ఞానం, జ్ఞాపకశక్తి పెరిగి జబ్బులు నాశన మవుతాయని తెలి పారు. ర్యాలీ అనంతరం ప్రజలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొ న్నారు. కార్యక్రమానికి శాఖాహారులు పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలంటూ మాస్టర్స్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిరమిడ్ మాస్టర్స్ డాక్టర్ ఎవి.సుబ్బారెడ్డి, చలపతి, శివనాగకృష్ణ, మల్లీశ్వరీ, వీరన్న, శ్రీనివాసులు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పిరమిడ్ శిక్షకులు

హెచ్‌ఐవి పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-పీలేరు

హెచ్‌ఐవి, ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని కోర్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ,నియంత్రణ యూనిట్, కోర్ వాలంటరీ ఆర్గనైజేషన్ సహకారంతో శనివారం పీలేరు పట్టణంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మీకు తెలుసా అనే పేరుతో హెచ్‌ఐవి, ఎయిడ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు హెచ్‌ఐవి, ఎయిడ్స్ గురించిన ముఖ్య అంశాలపై అవగాహన కల్పించింది. హెచ్‌ఐవి, ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష చూపవద్దని, వారు ప్రశాంతంగా జీవించడానికి సహకరించాలని తెలిపారు. క్షయవ్యాధి, చికిత్స ఎంపిక ప్రాముఖ్యత, హెచ్‌ఐవి, ఎయిడ్స్ నివారణలో కండోమ్ పోషించే కీలక పాత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కోర్ స్వచ్ఛంద సేవ సంస్థ సభ్యులు కె.రాజమ్మ, షర్మిల, రెడ్డిరాణి,టి.చందన, జి.ప్రమీల, వి.హేమమావతిబాయి పాలొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

దోమల నివారణకు ఫ్రైడేని డ్రైడేగా పాటించండి



విషజ్వరాలపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-వాల్మీకిపురం

దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించడం వలన దోమల వ్యాప్తి తగ్గుముఖం పడుతుందని మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ అన్నారు. శనివారం మండలంలోని గండబోయనపల్లిలో దోమల కాటు, దోమల వృద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకాటు ద్వారా మలేరియా, ఫైలేరియా, మెదడువాపు జ్వరాలు, డెంగ్యూ, చికెన్‌గున్యా వంటివి వచ్చే అవకాశముందన్నారు. ఇందు కోసం ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. సాయంత్ర వేళల్లో ఇంటి ముందు వేపాకు పొగ వేసుకోవడం, కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేసుకోవడం వంటివి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదవాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని ఎస్‌బివిడి సభ జూనియర్ కళాశాలలో శనివారం కరస్పాండెంట్ నూకల శ్రీరాములు ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించినప్పుడు తల్లిదండ్రులు సంతోషిస్తారని అన్నారు. ప్రిన్సిపల్ అద్దేపల్లి బాలాజీ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలలో ఇంటర్మీడియట్ విద్య అనేది కీలకమైనదని సమయపాలన పాటిస్తూ సంక్షిప్తమైన ప్రణాళికలతో చదువు కుంటే అనుకున్న లక్ష్యాలు సాధించవచ్చునని అన్నారు. తల్లిదండ్రులకు అనేక సూచనలు సలహాలు ఇచ్చారు. విద్యార్థులకు తల్లిదండ్రులు చదువు విషయంలో సహకరించాలని ఇంటిదగ్గర విద్యార్థి తల్లిదండ్రులు విద్యార్థులను ఉదయం పూట లేపి చదివిస్తే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తారని పేర్కొన్నారు. వివిఎన్ ఫ్రైడ్ అధినేత ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ విద్య ప్రాముఖ్యతను, ఇంటర్మీడియట్ విద్య తర్వాత విద్యార్థులకు ఉన్నటువంటి అవకాశాల గురించి తల్లిదండ్రులకు క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలోఅధ్యాపకులు పాల్గొన్నారు.


తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ బాలాజీ

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-రామసముద్రం

రామా నేత్రాలయా ఆధ్వర్యంలో చెంబకూరు కేంద్రంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 200 మంది ప్రజలు పాల్గొన్నారు. ఇందులో 65 మంది కంటి శాస్త్ర చికిత్సలకు ఎంపికైనట్లు కంటి వైద్య నిపుణులు ఫ్యాకో సర్జన్ డాక్టర్ ఎం.మహేష్ రెడ్డి తెలిపారు. వీరందరికి ఈ నెల 16 వ తేదీన మదనపల్లి రమా నేత్రాలయ ఆస్పత్రిలో ఉచిత చికిత్సలు నిర్వహించనున్నట్లు తెలి పారు. కార్యక్రమంలో సిబ్బంది మల్లికార్జున, గౌరీష్, జగన్నాధ్, యస్వంత్ పాల్గొన్నారు.

ఆప్కాస్ సిబ్బందికి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి ప్రభుత్వ సర్వజన భోదన ఆసుపత్రిలో పనిచేస్తున్న 26 మంది ఆప్కాస్ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని ఎఐటియుసి ఆధ్వర్యంలో 12వ రోజు నిరసనలు కొనసాగాయి. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ మదనపల్లి ప్రభుత్వ సర్వజన భోదన ఆసుపత్రిలో పని చేస్తున్న 26 మంది అవుట్ సోర్సింగ్ (ఆప్కాస్) సిబ్బందిలో నలుగురుకి 13 నెలలుగా, మరో 22 మందికి ఏడు నెలలుగా వేతనాలు రాలేదని, జీతాలు లేని కారణంగా ఆప్కాస్ సిబ్బంది కుటుంబ సభ్యుల పోషణ, పిల్లలు చదువులు, ఇంటి అద్దెలు చెల్లించలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పట్టణ కార్యదర్శి తిరుమల, సాంబశివ, కృష్ణప్ప, దేవా, మురళి, మేస్త్రి, సుబ్రమణ్యం, మృదుల పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించడం వలన దోమల వ్యాప్తి తగ్గుముఖం పడు తుందని మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ అన్నారు. శనివారం మండ లంలోని గండబోయనప ల్లిలో దోమల కాటు, దోమల వృద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకాటు ద్వారా మలేరియా, ఫైలేరియా, మెదడువాపు జ్వరాలు, డెంగ్యూ, చికెన్‌గున్యా వంటివి వచ్చే అవకా శముందన్నారు. ఇందు కోసం ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. సాయంత్ర వేళల్లో ఇంటి ముందు వేపాకు పొగ వేసుకోవడం, కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేసుకోవడం వంటివి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గణేష్ నిమజ్జనం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

వినాయక చవితి సందర్భంగా మండలంలో 8 రోజులుగా ఘననాదునికి పూజలు నిర్వహించారు. శనివారం అయప్ప గురుస్వామి వెంకటరమణ కుటుంబ సభ్యులు లక్కిరెడ్డిపల్లె మూడురోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద గణనాదునికి ఘనంగా పూజలు నిర్వహించి అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. లక్కిరెడ్డిపల్లె, గాండ్లపల్లె, గంగనపల్లి, సోములవాండ్లపల్లె గ్రామాలల్లో వినాయకుని నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు.

రాజీమార్గమే రాజమార్గం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

క్షణికావేశంలో గొడవలు పడకుండా చిన్న చిన్న విషయాలు రాజీ పడడమే రాజమార్గ మని లక్కిరెడ్డిపల్లె సివిల్ జడ్జి షేక్ ఫైజాన్నిసా పేర్కొన్నారు. శనివారం లక్కిరెడ్డిపల్లె కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో పరిష్కారంకానీ సివిల్ కేసులు, బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించని మొండి బకాయిల లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. 58 కేసులకు పరి ష్కారం అయినట్లు వారు తెలిపారు. గ్రామాలల్లో భూ తగాదాలు, చిన్న చిన్న గొడవలు, ఇంటి స్థలాలు సమస్యలు గ్రామంలోనే పరిస్కరించుకోవాలని ప్రతి సారి పోలీసు స్టషన్, కోర్టుల చుట్టూ తిరగద్దని కక్షిదారులకుసూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎంఎల్.రామచంద్రారెడ్డి, రెడ్డెన్న, చెన్నక్రిష్ణయ్య, పోలీసు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరు వాసికి ఆచార్యదేవోభవ జాతీయ పురస్కారం

ప్రజాశక్తి-పీలేరు

2024 సంవత్సరం ఆచార్యదేవోభవ జాతీయ పురస్కారాన్ని పీలేరుకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సరస్వతి శ్రీరామరాజు అందుకున్నారు. విద్యారంగంలో విశేష సేవలు అందించిన వారికి యువతేజం ట్రస్టు, కలాం విజన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం తిరుపతి జీవకోనలోని విశ్వం విద్యాసంస్థలో పురస్కా రాలు ప్రధాన ఉత్సవం జరిగింది. సరస్వతీ శ్రీరామరాజు విద్యారంగంలో చేసిన విశేష కృషికి గాను ఈ గౌరవం దక్కింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ద్రవిడ విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపకులపతి రత్నం, ప్రముఖ కవి నారాయణ స్వామి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.



ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సీతారాం ఏచూరికి ఎస్ఎఫ్ఐ నివాళి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పేద విద్యార్థుల, కార్మికుల గొంతు మూగబోయిందని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మదన్ మోహన్ రెడ్డి, గురునాథ్ అన్నారు. సీతారాం ఏచూరి మృతి పట్ల ఎస్ఎఫ్ఐ అన్నమయ్య జిల్లా కమిటీ సంతాపం ప్రకటిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారాం ఏచూరి తన ప్రజా జీవితాన్ని ఎస్ఎఫ్ఐలో చురుకైన నాయకుడిగా ప్రారంభించారు. ఢిల్లీలో తన కళాశాల రోజులలో ఎస్ఎఫ్ఐలో సభ్యుడయ్యారు. తరువాతి సంవత్సరాల్లో జెఎన్‌యు విద్యార్థుల్లో అత్యంత ప్రజాదరణ పొందిన శక్తివంతమైన నాయకులలో ఒకరిగా ఎదిగారని అన్నారు. ప్రధాని ఇందిరా గాంధీని సైతం జెఎన్‌యు ఛాన్సలర్ పదవి నుంచి వైదొలగడానికి దోహదం చేసారన్నారు. దేశంలో విద్యార్థి ఉద్యమంలో వీరోచిత సంఘటనలలో ఒకటిగా మిగిలిపో యింద న్నారు. దేశంలోని శ్రామిక ప్రజలకు నాయకుడిగా ఉంటూ వారి మెరుగైన జీవితం కోసం పోరాడారు. పార్లమెంటు లోపల, బయట పేదల నాయకుడిగా ఆయన భారత దేశంలోని కార్మికవర్గం కోసం కృషి చేశారు భారత విద్యార్థి ఫెడరేషన్ అన్నమయ్య జిల్లా కమిటీ సీతారాం ఏచూరి జీవితాన్ని, విద్యార్థి ఉద్యమానికి, దేశంలోని శ్రామిక ప్రజల కోసం పోరాటానికి చేసిన కృషిని గౌరవిస్తుందని అన్నారు. భారతదేశ ప్రజా స్వామ్య, లౌకిక, సామ్యవాద ఆదర్శాల కోసం పోరాడుతున్న ఎస్ఎఫ్ఐకి ఆయనే స్ఫూర్తి అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాయచోటి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండల కేంద్రంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ ఎదురుగా తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి రాష్ట్ర రవాణా, యువజన,క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి హాజరవుతారని టిడిపి మండల యువ నాయకులు మాజీ ఎంపిటిసి మదన్‌మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం నుంచే కార్యాలయ ఆవరణ మొత్తం అలంకరించారు. కార్యాలయ ప్రారంభోత్సవ అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. బహిరంగ సభ ఏర్పాట్లను సిఐ. వెంకట కొండారెడ్డి, ఎస్ఐ. రవీంద్ర బాబులు పరిశీలించారు. ఈ బహిరంగ సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు , ప్రజలు పెద్దఎత్తులో పాల్గొని గ్రామాల సమస్యలు మంత్రి రాం ప్రసాద్ రెడ్డికి తెలపాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సురేష్‌రెడ్డి , విష్ణు వర్ధన్ రెడ్డి , కొండూరు వెంకట్రామ రాజు, రాజంపేట డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి షఫీ నాయక్, ఆరీఫుల్లా పాల్గొన్నారు.

రూ.35 వేలు పలికిన కోటగుడిబండ లడ్డూ

ప్రజాశక్తి- కలకడ

శ్రీ వినాయక స్వామి నిమజ్జన కార్యక్రమంలో భాగంగా లడ్డూను వేలంపాటు వేశారు. రూ.35వేలకు పరస శివయ్య దక్కించుకున్నారు. మండలంలోని కోట గుడిబండ పంచాయతీ గుడిబండలో అంగరంగ వైభవంగా వినాయకుని నిమజ్జన కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.చిన్న పెద్ద తేడా లేకుండా రంగులు పూసుకుని బళ్లారి డప్పుల మధ్య నాట్యములు చేస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.


వేలంపాటలో లడ్డూను దక్కించుకున్న శివయ్య



అద్దె భవనంలో కొనసాగుతున్న శాఖ గ్రంథాలయం

అద్దె భవనంలోనే గ్రంథాలయం

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రం గాలివీడులో అద్దె భవనంలో మండలశాఖ గ్రంథాలయం కొనసాగుతోంది. స్వతంత్రం సిద్ధించి ఇన్ని సంవత్సరాలు అవుతున్నా పక్క భవనానికి నోచు కోలేదని పాఠకులు పేర్కొన్నారు. గతంలో గ్రామ సచివాలయంలోనే ఒక గదిలో గ్రంథాలయ ప్రారంభం నుంచి కొనసాగిస్తూ వచ్చారు. పంచాయతీకి మూడు సచివాలయాలు రావడంతో సిబ్బంది ఇరుకుగా ఉన్నందున ఎదురుగా అద్దె భవనానికి మార్చారు. జిల్లా గ్రంథాలయ అధికారి దృష్టిపెట్టి పక్క భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యార్థులు, పాఠకులు కోరుతున్నారు.


విరాళం అందజేస్తున్న వరికూటి చంద్రశేఖర్

రాజగోపుర నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని భువనగిరిపల్లెలో వెలసివున్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయ రాజగోపురం నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన వరికూటి చంద్రశేఖర్ ఆయన తండ్రి వరికూటి నరసింహులు జ్ఞాపకార్థం శనివారం రూ.లక్ష విరాళం ఆలయ ధర్మకర్తలకు అందించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు దాత చంద్రశేఖర్ కుటుంబానికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కె.ఎస్ నరసింహ, కావేరిగారి వెంకటరమణ, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

17 నుంచి టిటిడి ధార్మిక కార్యక్రమాలు


ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

టిటిడి, హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో మన్నూరు గ్రామ దళితవాడలో గల మాతమ్మ ఆలయంలో మంగళవారం నుంచి 5 రోజులపాటు సాయంత్రం 6.30 గంటల నుండి ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ టి.గోపిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణచే మంగళ, బుధ, గురు వారాలలో రామాయణం, మహా భారతం, భగవద్గీతల పైన ధార్మికోపన్యాసం, అనంతరం స్థానిక భక్తులచే భజన కార్య క్రమం ఉంటుందన్నారు. శుక్రవారం స్థానిక మహిళలచే కుంకుమార్చన, భజన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

ప్రతి శనివారం అన్నదానం

- అన్నదాత మల్లు శివారెడ్డి

ప్రజాశక్తి-సుండుపల్లి



మండలంలోని బైరాగుట్ట సమీపంలో ఉన్న సాయిబాబా, ఆంజనేయ స్వామి గుడి దగ్గర ప్రతి శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న అన్నదాత మల్లు శివారెడ్డి పేర్కొన్నారు.పేద ప్రజల కోసం ప్రతి వారంలో శనివారం ఒక్కరోజు అన్నదాన కార్యక్రమం చేయడం జరుగుతుందని తెలిపారు. మండ లంలోని ఎంసిఆర్ కల్యాణ మండపాన్ని ఏర్పా టు చేసి పేద వర్గాలకు అందుబాటులో ఉంచి నట్లు తెలిపారు. పేద లకు కోసం త్వరలో అనాథ శరణా లయం కూడా నిర్మించేందుకు యోచన చేస్తు న్నట్లు తెలిపారు. కస్తూర్బా పాఠశాల పక్కన నిర్మించడానికి గతంలో భూమిపూజ కూడా చేసి నట్లు తెలిపారు. ప్రజాసేవలోనే నిరంతరం కృషి చేస్తానని పేద ప్రజల కోసం మన సొంత ఊరిలో వ్యవసాయ భూమిని పేద ప్రజలకు ఇవ్వడం జరిగిందని ఆయన తెలింపారు. గతంలో రాయచోటి సమితి అధ్యక్షులుగాను కొనసాగడం కూడా జరిగిందని రాజకీయంగా ప్రజా సేవ చేయడానికి ఎప్పుడు నిరంతరం కృషి చేస్తా నని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రైం కార్నర్

ఎన్‌హెచ్ రోడ్డు పనుల్లో అపశృతి

-టిప్పర్‌లోని రాళ్లు మీద పడి బిహార్ వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : జాతీయ రహదారి పనులు చేస్తున్న కార్మికులపై ప్రమాదవశాత్తు టిప్పర్‌లో నుంచి రాళ్లు పడడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడగా వారిలో ఒకరు మృత్యు వాత పడ్డారు. బి.కొత్తకోట మండలంలో జరిగిన ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బి. కొత్తకోట మండలం, తుమ్మనం గుట్ట వద్ద జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయని తెలిపారు. బీహార్, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఇక్కడ పనులు చేస్తున్నారని అన్నారు. పనుల్లో భాగంగా టిప్పర్ లోని రాళ్లను లోడ్ చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కార్మికుల మీద పడ్డాయని తెలిపారు. ఈ ప్రమాదంలో బీహార్ రాష్ట్రం, గోపాల్ గంజ్ జిల్లా, లాక్వార్ గ్రామానికి చెందిన అమర్‌సింగ్ కుమారుడు అతుల్‌కుమార్‌సింగ్(45), పంకజ కుమార్ సింగ్, మహారాష్ట్రకు చెందిన రామ్‌ధ్యాన్‌లు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారికి మదనపల్లె సర్వ జన బోధనాస్పత్రికి తరలి స్తుండగా మార్గ మధ్యలో అతుల్‌కుమార్‌సింగ్ మృతి చెందాడని తెలిపారు.. తీవ్రంగా గాయ పడిన పంకజ్ కుమార్ సింగ్, రామ్‌ధ్యాన్ లకు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

ఆరుగురు పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-పుల్లంపేట : మండల పరిధిలోని వత్తలూరు, ఈడిగపల్లె గ్రామానికి తూర్పు వైప ున గల కంపచెట్లలో పేకాట ఆడుతున్న ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసివారి వద్ద నుంచి రూ.5070లు స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్ఐ మోహన్ కుమార్‌గౌడ్ తెలిపారు. శనివారం సాయంత్రతన సిబ్బందితో పేకాట స్థావరంపై దాడులు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.

ఆటోలో నుంచి పడి బాలుడు దుర్మరణం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి: ఆటోలో ప్రయాణిస్తూ పట్టు తప్పి ఒక బాలుడు క్రింద పడి మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబీకుల కథనం మేరకు..ఆర్ఎన్ తాండాకు చెందిన మహేష్‌నాయక్ దంపతులు పిల్లల చదువు కోసం పుంగునూరు సుగాలిమిట్టలో నివాసముంటూ పుంగనూరులో పిల్లలను చదివిం చుకుంటున్నట్లు తెలిపారు. పిల్లలతో కలిసి పండుగ కోసం స్వగ్రామం ఆర్ ఎం తండాకు వచ్చారని తెలిపారు. శనివారం తన సొంత ఆటోలో మహేష్ నాయక్ భార్యా పిల్లలతో ఆర్యన్ తాండా నుంచి సుగాలి మిట్టకు బయలుదేరినట్లు చెప్పారు.. కురవాలకోట మండలం దాదంవారి పల్లెకు వెళ్లగానే రోడ్డు గుంతలు పడి ఉండడంతో ఆటో నడుపుతున్న మహేష్ పక్కనే కూర్చున్న కుమారుడు అక్షయ 7 సంవత్సరాలు పట్టుతప్పి కింద పడిపోయాడు. తలకు బలమైన గాయం తగలడంతో హుటాహుటిన మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆ బాలుడు మృతి చెందాడని చెప్పారు. ఒక్కగానొక్క కుమారుడు తమ కళ్ళ ఎదుట ప్రాణాలు వదలడం తో తల్లిదండ్రులు గుండెలు బాధ కొంటూ రోదించారు.